20610860 1

# ప్రబోధ 24

వేదశాస్త్రములు వివరించి బుధులచే
చదివించవచ్చు తా చదువవచ్చు
యజ్ఞయాగ తపము లధికారి జనులచే
చేయించవచ్చు తా చేయవచ్చు
ఇలలోనగల తీర్థములకేగ నన్నుల
బోధించవచ్చు తా పోవవచ్చు
అష్టాంగయోగ సిద్ధార్థులకును బోధ
సలుపంగ వచ్చు తా సలుపవచ్చు
కాని తమ మనో బుద్ధ్యహంకారములను
నిల్పి అంతర్ముఖము చేసి అనవరతము
నిశ్చల సమాధి నిష్టులై నిలువ తేరు.

దివ్యాత్మస్వరూపులారా!

జ్ఞానానాం ఆత్మజ్ఞాన ముత్తమమ్. జ్ఞానములన్నింటి కంటెను ఆత్మ జ్ఞానము ఉత్తమమైనది. ఈ ప్రపంచములో భౌతిక జ్ఞానము, వైజ్ఞానిక జ్ఞానము, సంగీత జ్ఞానము, సాహిత్య జ్ఞానము, నృత్య జ్ఞానము, చిత్ర జ్ఞానము, శిల్ప జ్ఞానము యిట్లా ఎన్నియో భౌతిక జ్ఞానములు కన్పించుచున్నవి. ప్రాకృతమైన జ్ఞానములు యెన్ని సంపాయించుకున్నప్పటికిని ఆధ్యాత్మిక జ్ఞానమనేది, ఆత్మ జ్ఞానమనేది ఒక్కటి లేకుండిన యివన్నియు కూడను శాంతి సుఖములను కూర్చలేవు. ప్రాపంచికముగా కీర్తిప్రతిష్టలను అందుకొని వుండవచ్చు. ఉన్నత పదవుల నేలవచ్చు. కాని ఆత్మానందము లభించవలెనన్న ఒక్క ఆత్మ జ్ఞానమే అవసరము. అది లేకుండిన నహినహి రక్షతి డుకృఞ్ కరణే, యిది యే మంత్రము కూడను మానవుని రక్షించలేదు. ఏ జ్ఞానము అనేకత్వములోని యేకత్వమును, వ్యత్యపులోని అవ్యతత్వమును చూపించునో అట్టి జ్ఞానమే ఆత్మజ్ఞానము. ఇట్టి యేకత్వమును గుర్తించిన వ్యక్తికి మాత్రమే సర్వజ్ఞుడని చెప్పవచ్చును. ఇలాంటి సర్వజ్ఞత్వను సాధించటానికి ఆత్మజ్ఞానము ఒక్కటే రాజమార్గము. లోకములో అనేక విద్యలను అభ్యసించవచ్చును. పండితుడని పేరుప్రఖ్యాతులు పొందవచ్చును. గొప్ప కళాకారుడు కావచ్చును. కాని ఆత్మజ్ఞానమే లేకుండిన యివన్నియు కూడను నిరుపయోగము లవుతాయి

తరతి శోక మాత్మవిత్ అన్నది ఉపనిషత్. అనగా శోకమును నివారణగావించునది, నిర్మలముగావించునది ఒక్క ఆత్మ జ్ఞానమే. శోకమును నివృత్తి గావించలేని శ్లోకములు ఎన్ని చదివినప్పటికిని యివి కాలమును వ్యర్థమును, జీవితము కూడను నిరర్థకము గావించును. ఈ ప్రాపంచిక విద్యలన్నియు కూడను, యీ ప్రాపంచిక జ్ఞానమంతయు కూడను జీవనోపాధినిమిత్తమై ఏర్పడినది.

సమస్త జ్ఞానమునకును మూలాధారమై, సమస్త కళలకును నిధియైన దైవత్వాన్ని పొందినప్పుడు సమస్త విద్యలు తనకు కరతలామలకమవుతాయి. సర్వశక్తిమయుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకత్వము వహించిన దైవత్వాన్ని పొందే ప్రయత్నమునకు మానవుడు ప్రయత్నించినప్పుడే యిది ఆత్మ జ్ఞానమునకు అతిసమీపముగావుంటుంది. ఇట్టి ఆత్మ జ్ఞానము కేవలము చిత్త శుద్ధి కలిగిన వ్యక్తులకు మాత్రమే లభ్యమవుతుంది. చిత్త శుద్ధి లభించే మార్గము ఏమిటి? పవిత్ర కర్మలను ఆచరించటము అత్యవసరము. యజ్ఞయాగాది క్రతువులు, దాన ధర్మాది కర్మలు, తపశ్శక్తులు దీనికి సరైన మార్గములు. పవిత్ర హృదయులను దర్శించటము, వారి చరిత్రలను పవిత్రముగా పఠించటము యిత్యాది కర్మల ద్వారా కూడను చిత్త శుద్ధి యేర్పడుతుంది. కనుక చిత్తస్య శుద్ధయే కర్మః అన్నారు. ఈ సత్కర్మల చేతను, యీ పవిత్రమైన కర్మల చేతను చిత్త శుద్ధి మాత్రమే యేర్పడుతుంది. ఈ చిత్త శుద్ధి ద్వారా జ్ఞాన శుద్ధి కలుగుతుంది జ్ఞానా దేవతు కైవల్యమ్. ఇదే మోక్షమునకు సులభ మార్గము. కనుక సత్కార్యములు ఆచరించి, సత్సంగములో ప్రవేశించి, సద్భావముల చేత సంఘసేవలో మనము పాల్గొనాలి. అయితే యీ విధమైన యజ్ఞయాగాది కర్మలకు గాని, పవిత్ర పఠనలకు గానీ విద్య అవసరము కదా! మనము ఎట్టి విద్యలు, లౌకిక విద్యలు నేర్చుక పోయినప్పటికి యీ చదువులన్నియు కూడను కేవలము మానవుని యొక్క ఏకత్వము భిన్నము గావించుచున్నదనే సత్యాన్ని గుర్తించటము లోపల యీ విద్యల దుర్పయోగము జరిగిపోవుచున్నది. గాఢమైన విశ్వాసము యీ యొక్క మార్గమునకు అత్యవసరము. నిన్ను నీవు నమ్మి నమ్మి నమ్మి. నీ భగవంతుని నీవు నమ్మి నమ్మి. ఇదే నిజమైన రాజ మార్గము Faith in yourself and faith in GOD. This is the secret of greatness. ఈనాటి విశ్వాసము లేశ మాత్రము కూడను గాఢముగా కనుపించటము లేదు. స్వార్థ స్వప్రయోజన నిమిత్తమై యేర్పడిన విశ్వాసములే అధికముగా కనుపించుచున్నవి గానీ పరార్థమైనది, పరమాత్మ సంబంధమైనది, ఆత్మసంబంధమైన విశ్వాసములు చాలా తక్కువగా వున్నవి. ఈ విశ్వాసము పవిత్రమును కోల్పోవటం చేతనే మానవుడు యెన్ని

విధములైన సాధనలు చేసినప్పటికిని, ఎన్ని విధములైన జ్ఞానములు ఆర్జించినప్పటికిని యివి కేవలము నిరుపయోగములుగా రూపొందుతున్నవి. యో మద్భక్తః స మే ప్రియః ఎవడు నాకు భక్తుడుగా వుండునో వాడే నాకు ప్రియుడు. అనన్యభక్తి అత్యవసరము. ఈ అనన్యభక్తి అంటే ఏమిటి? ఎక్కడ పరిపూర్ణమైన ప్రేమనో అక్కడనే శ్రద్ధ. ఎక్కడ శ్రద్ధనో, శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అక్కడ జ్ఞానము. ఎక్కడ నిజమైన సాధనో అక్కడ సాధన. ఎక్కడ సాధనో అక్కడ సాధ్యము. ఈ సాధ్యమన్నను పరమ భక్తి అన్ననూ అనన్య భక్తి అన్ననూ ఒక్కటే. ఆత్మ జ్ఞాన మన్ననూ, పరమాత్మ జ్ఞాన మన్ననూ, ఆధ్యాత్మ జ్ఞాన మన్నను పేరులు వేరు వేరుగానే గమ్యము ఒక్కటే. ఇవన్నియు కూడను పరతత్త్వమునకు పర్యాయ పదములు. కనుక యిట్టి భక్తులు కావలెనన్న లౌకిక విద్యలుగాని యింకే విధమైన శక్తి సామర్థ్యములుగాని, జాతి మత కుల వర్ణ లింగ భేదములు కూడను దీనికి యేమాత్రము సంబంధము లేదు.

వాల్మీకి ఎవ్వని వంశమందలి వాడు
నందుండు ఏ పల్లె యందు పుట్టె
ధరకు చేటుడు ఎంత ధనము కల్గియుండె
గజరాజు యే విద్యగల్గియుండె
వసుధ ధృవుండెంత వయసు కల్గియుండె
శబరి ఎంతటి శక్తి కల్గియుండె
విదురునికెంతటి వితరణ మతి యుండె
తిన్ననికెంత తెలివియుండె
భక్తి కల్గిన వారికి వశుడనయ్య
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పలుకు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులారా!

పాండిత్య ప్రభావము కాదు దీనికి ఆధారము. దీనికి కావలసినది, నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన ప్రేమనే. కాని యీనాడు స్వార్థము, అపవిత్రము, మాలిన్యమైన మనస్సుతో మాధవుని చింతించుటానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మనస్సునకు భగవంతుడు ఏనాడు లభ్యము కాడు.

మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనామ్ మానసికముగా, వాచకముగా, కాయకముగా భగవంతుని చింతించటానికి ప్రయత్నించాలి. ఈనాడు ఆచరణ వేరు. తలంపులు వేరు. కేవలము ఆడంబరమైన సాధనలో యీనాడు ఆలవాలమై

పోయింది యీ సాధన. అహంకార ఆడంబరములకు భగవంతుడు లభ్యము కాడు. కనుకనే చిత్తశుద్ధి నిమిత్తమై మనము ఆచరించే కర్మలు ఫలరహితమైనవిగా, స్వార్థరహితమైనవిగా అహంకార రహితమైనవిగా మనము రూపొందింప జేసుకోవాలి. దీపమును వెలిగించుటకు ఎవ్వరికైననూ అధికారముంటున్నది. పురుషుడు వెలిగించ వచ్చును. స్త్రీ వెలిగించ వచ్చును. వృద్ధుడు వెలిగించ వచ్చును. యువకుడు వెలిగించ వచ్చును. కనుక జ్ఞాన జ్యోతిని వెలిగించు కొనుటకు సర్వులకు అధికారము వుంటున్నది. వారి వారి శక్త్యానుసారము వారి సాధనలు పురస్కరించుకొని వారు వారు యీ జ్ఞానము పొందటానికి తగిన ప్రయత్నము చేయ వచ్చును. అయితే సామాన్యముగా ప్రతి మానవునికి కూడను విహిత కర్మలు వుంటున్నాయి. ఇందులో నైమిత్తిక కర్మలని ఒకటి. రెండవది కామ్యకర్మలని. నిషిద్ధకర్మలని మూడవది. ప్రాయశ్చిత్త కర్మ అని నాల్గవది. ఈ నాలుగు కూడను ప్రతి మానవుడు తప్పనిసరిగా చేయవలసి వస్తుంది.

నైమిత్తిక కర్మ అనగా యేమిటంటే నిమిత్త మాత్రంగా ఏర్పడిన కర్మలంతా నైమిత్తిక కర్మలంటారు. ఇవి కొన్ని వ్రతములుగా వుండవచ్చును. కొన్ని నోములుగా వుండవచ్చును. కొన్ని కొన్ని నెలకొక పర్యాయము, మూడు నెలలకొక పర్యాయము, సంవత్సరమునకొక పర్యాయము శ్రాద్ధము లనేవి వస్తుంటాయి. ఇవి కూడను నైమిత్తిక కర్మలలో చేరినవే. సూర్యగ్రహణము, చంద్రగ్రహణము ఏర్పడుతుంటాయి. అలాంటి సమయములో గ్రహముల శాంతి నిమిత్తమై చేసే కర్మలు కూడను నైమిత్తిక కర్మలే. ఇవి సామాన్యమైన మానవులు, సంసార జీవితము గడిపే మానవులు ఆచరించవలసిన నైమిత్తిక కర్మలు.

ఇంక కామ్య కర్మలు. అనగా సకాలమునకు వర్షములు కురవాలి. పంటలు పండాలి. ఈ దుర్భిక్షము పోవాలి. సుభిక్షము రావాలి. లోకమంతా కూడను శాంతిగా వుండాలి. తాను సర్వమును అనుభవించాలి. ఇహమునందు సుఖమును అనుభవించాలి. అనగా ఇహ పర సుఖముల నిమిత్తము, లోక కళ్యాణ నిమిత్తము ఆచరించే కర్మలన్నీ కామ్యకర్మలే. లోకాసమస్తా సుఖినో భవంతు ఇది యుగ యుగములనుండి తరతరములనుండి హైందవ జాతి యొక్క సాంప్రదాయములో ప్రధానమైనది. ఈ విధమైన విశాల హృదయము చేతనే భారతీయ సంస్కృతి నాటినుండి నేటి వరకు యేవిధమైన లోటు లేకుండా జరుగుతూ వస్తుండాది. లోకమనగా యేమిటి? మన మున్న జీవితము. మన లోకమంటే ఏమిటి? దీనికి సాలోక్యము, సారూప్యము, సామీప్యము, సాయుజ్యము అని దీనికి నాలుగు విధములైన తెగలు యేర్పడుతూ వచ్చాయి. అంటే సాలోక్యమనగా తానుయే విధమైన చింతనతో తాను జీవిస్తున్నాడు. లోకమనగా ప్రపంచములో వుండిన కొండలు

గుట్టలు, నదులు, యీ పట్టణాములు యివన్నీ చేరినదికాదు లోకము. మనోమూలమిదం జగత్ మనస్సులోకమే సర్వలోకములకు మూలాధారము. ఈ మనోలోకమును స్వచ్ఛముగా పవిత్రముగా, నిస్వార్థముగా వుంచుకున్నప్పుడు లోకమంతా కూడను పవిత్రముగా వుంటుంది. ఈ బయట ప్రపంచమునంతను మనము పచ్చగా చూడాలనుకుంటే ప్రపంచమునంతా మనము పచ్చని రంగును వేయనక్కరలేదు. మన దృష్టికి పచ్చని రంగు వేసుకుంటే జగత్తంతా పచ్చగానే కనుపిస్తుంది. కనుకనే దృష్టిని బట్టియే సృష్టి. మన నేత్రమునుబట్టియే శాస్త్రము వుంటున్నాది. కాని మనలో వుండిన మనోభావముల యొక్క లోకాన్ని మనము నిర్మలముగా వుంచుకొనుటకు ప్రయత్నించాలి. కనుక పవిత్రమైన మనస్సుతో ప్రార్థనలు సలిపినప్పుడు పరమాత్మ తత్త్వమనేది అనుగ్రహించటానికి అవకాశము వుంటున్నాది. ఆర్తుడై ప్రార్థన చేయుటము ప్రధాన మార్గము. అట్టి ప్రార్థనకు ఉపాంగములే యజ్ఞయాగాదిక్రతువులు. ఇది స్వార్థము పరార్థము. ఇహము పరము. రెండింటి యొక్క చేరికగా వుంటున్నాది.

ఇహమును సుఖింప హేమతారక విద్య
పరమును సుఖింప బ్రహ్మవిద్య

లౌకిక విద్యలన్నియు కూడను యిహమునకు మాత్రమే ఆనందమును చేకూర్చును. బ్రహ్మవిద్య పరలోకమును కూడను ఆనందమును అందించటానికి వీలుగా వుంటుంది. కనుకనే కామ్యకర్మలనగా తనకు, తనలోకమునకు, తన వారలకు కూడను సుఖశాంతులను చేకూర్చే మార్గము అని. కనుక మనము నిత్యము ఆచరించే పూజలు, షోడశోపచారములు

శ్రవణం కీర్తనం విష్ణోస్స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం

ఈ మార్గములన్నీ కూడను కేవలము కామ్యకర్మలు మాత్రమే.

మూడవది నిషిద్ధ కర్మ. మనము కొన్ని విడువవలసినవి వున్నాయి ఆహారమును బట్టే మన యొక్క మనఃప్రభావము వుంటుండాది. కనుకనే సాత్త్విక ఆహారము అత్యవసరము. సాధకులు రజోగుణ తమోగుణ సంబంధమైన ఆహారములు పూర్తి వదలిపెట్టాలి. మద్యపానము, మాంసాహారము యిత్యాది మత్తు పదార్థములు అన్నియూ వదలిపెట్టాలి. ఎట్టి ఆహారమో అట్టి తలంపులు. ఎట్టి తలంపులో అట్టి మనస్సు. ఎట్టి మనస్సో అట్టి మనిషి. ఎట్టి మనిషో అట్టి ప్రవర్తన. ప్రవర్తన బట్టే మన సంస్కృతి ఆధారపడి వుంటుంది. నీతితో కూడిన ప్రవర్తన మనకు అత్యవసరము. నిజాయతీతో కూడిన వాక్కు మనకు అత్యవసరము. నీతి నిజాయతులే మానవుని యొక్క నేత్రములు. ఈనీతి

206108606

నిజాయితీని మనము కోల్పోయిన తరువాత మానవత్వమే వ్యర్థము. నిషిద్ధ కర్మలనగా మనము త్యజించవలసిన కర్మలు ప్రత్యేకముగా కొన్ని వుంటున్నవి. ఇది ఆహార విహార నిమిత్తమై మనము ఆచరించవలసిన ప్రధాన కర్తవ్యము. ఎట్టి ప్రవర్తనలో నేను వుంటున్నాను అని తనకు తాను పరీక్షించుకోవాలి. నేను చెప్పిన మాటకు తలచిన తలంపుకు నా ప్రవర్తన సరిగా వున్నదా లేదా అని చింతించాలి. కానీ నా తలంపు ఎవరికీ తెలియదు కదా అని నీవు మాటల యందు, పనుల యందు మార్పులు సంభవింప జేసుకున్న నీ తలంపులు లోకులు యెరుగరు కానీ లోకేశుడు యెరుగును.

లోకుల కన్నులు కప్పగలవు గానీ
చిట్టా వ్రాసే చిత్రగుప్తకం
డ్లెట్టుల గంతలు గట్టుదురా

చిత్రంగా గుప్తమై వుంటున్నాడు నీ చిత్తములో భగవంతుడు. లోకాన్ని వంచించవచ్చు లోకానికి మరుగు పరచవచ్చు. లోకానికి కన్నుల గంతలు కట్టవచ్చు. కానీ భగవంతుని కన్నుల గంతలు కట్టుటానికి వీలుకాదు. ఏనాటికైనా కూడను యీ ఫలము మనకు తప్పినది కాదు. కర్మఫల సిద్ధాంతము మాత్రము తప్పక విశ్వసించి తీరాలి. కనుక కర్మఫల సిద్ధాంతమును అంగీకరించినదే మన భారతదేశము. కనుకనే భాగవతమునందు కూడను

కర్మమున పుట్టు జంతువు
కర్మముననె వృద్ధి పొందికర్మమున చనున్
కర్మమె నరునకు దైవము
కర్మమె సుఖ దుఃఖములకు కారణము ఇలలోన.

కరణం, కారణం, కర్మ యీ మూడింటి యొక్క సమ్మేళితమే మానవుని యొక్క జీవితము కనుక మానవుని యందు పవిత్రమైన భావములు అభివృద్ధి పరచుకోవాలి. పవిత్ర భావములు అభివృద్ధి పరచుకొనవలెనన్న సాత్వికాహారము అత్యావసరము. మితముగను హితముగను కూడా వుండాలి. సాత్వికాహారమని కూడను అధికముగా మనము భుజించరాదు కేవలము జీవితమంతయు లోకసంబంధమైన కర్మలయందే మనము దీనిని అంకితము గావించరాదు. జీవితము దీర్ఘప్రయాణము. ఈ దీర్ఘప్రయాణములో మనము చేరవలసిన గమ్యమునకు తగిన శక్తిని సంపాయించుకోవాలి. కనుక పవిత్రమైన ఆహారము చేతను, పవిత్రమైన భావముల చేతను మానవుడు తన తత్వాన్ని తాను గుర్తించు కోటానికి కొన్ని విధములైన నిషిద్ధములు. అనగా త్యజించవలసినవి కొన్ని వుంటున్నవి. ఒక భూమిని మనము దున్ని పంట పెట్టవలెనన్న అందులో పూర్వము వుండిన

206108607

ముండ్ల చెట్లను, పనికి మాలిన పైరునంతా పెరికి వేయాలి. దాని తరువాత దానిని దున్ని దుక్కి చేసి మనము పెట్టవలసిన పంటకు తగిన విత్తనము నాటాలి. అప్పుడే ఆశించిన పంటను, ఫలమును మనము అందుకోగలము. అదే విధముగనే మనము త్యజించవలసిన భావములు త్యజించిన తరువాతనే, భజించవలసినదానికి అవసరమైన బీజములు మనము నాటుకోవచ్చును. కనుకనే మన నిత్య జీవితములోపల నిషిద్ధకర్మలను త్యజించాలి.

నాల్గవది యిదికేవలము పరిహారార్థమై గావించవలసినవి. మనము తెలిసో తెలియకో ఎన్నో విధములైన దోషములు, పాపములు చేసి వుంటాము. కనుకనే వీటి పాప పరిహారార్థమై మనము గావించవలసిన కర్మలు కొన్ని వుంటున్నాయి. వీటికి భారతీయ మహర్షులందరు కూడను తాము అనుభవించి, ఆచరించి, ఆనందించి లోకానికి అందించి పోయిన కొన్ని మార్గము లున్నవి. అనేక సాధనలలో కూడను సాధించి, శోధించి మానవులకు అవసరమైన మార్గములను బోధించారు. అవియే పవిత్రక్షేత్ర దర్శనములని పవిత్ర నదీస్నానములని, యీ పాప పరిహారార్థమై కొన్ని నియమములను నియమించుచూ పోయారు. దర్శనం పాప నాశనమ్. సంభాషణమ్ సంకట నాశనమ్, స్పర్శనమ్ కర్మవిమోచనం అనే మూడు మార్గములను పురస్కరించుకొని అప్పుడప్పుడు మనము మానసిక శాంతి నిమిత్తమై మానసిక పవిత్రత నిమిత్తమై కొన్ని విధములైన యాత్రలు కూడను మనము చెయ్యాలి. ఈ యాత్రలు యేవిధమైన భావముతో వుండాలి అంటే చిత్తశుద్ధితో, నిశ్చల భక్తితో, ఫలాపేక్షరహితముగా యాత్రలు మనము చెయ్యాలి. కొంతమంది మొక్కులు కూడను కొంత విచిత్రమైనవిగా వుంటాయి. ఓ వెంకటరమణస్వామీ! నా కార్యము, నా బిడ్డల పెండ్లి, నా కొడుకులు చక్కగా వుత్తీర్ణులైతే నేను వచ్చి నా కొడుకుల చేత వారి తలవెంట్రుకలు అర్పిస్తానని మొక్కుకుంటారు. ఇంకా యీనాడు యీ కలిప్రభావము చేత మరింత చిత్రవిచిత్రమైన మార్గాన్ని అవలంబిస్తున్నారు పేపర్లలో వస్తుందాది. పది లక్షల లాటరీ వుంటున్నాది. స్వామి ఆ పది లక్షలు నాకు వచ్చిందంటే నీకొక నూరు రూపాయలు చెల్లిస్తానంటారు. ఈ విధముగా మొక్కల లోపల దైవాన్ని యేవిధముగా వీరు భావిస్తున్నారో మనము విచారించాలి. నీ నూరు రూపాయల కోసము భగవంతుడు అక్కడ కాచుకొని వుంటున్నాడా? సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు అయిన భగవంతునికి నీవు యిచ్చే నూరు రూపాయలు యెంతటివి. తన కోరికల లోపలనే ఆ యొక్క వివేకాన్ని చింతించుకోలేక పోతున్నాడు. భగవంతుడా యీ పది లక్షలు నాకు వచ్చేటట్టు చేయి. చేసేది ఎవరు భగవంతుడే. తానే పదిలక్షలు తన కందిస్తుంటే తాను నూరు రూపాయలు భగవంతునికి యేమిటి అందించటము. ఇది యెంత తెలివి తక్కువ.

206108608

దేశకాల పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని కలిలో విచిత్రమైన బుద్ధులు కూడను అభివృద్ధి అవుతున్నాయి. భగవంతునికి తుచ్ఛమైన బొచ్చు యిచ్చి ఉత్తమమైనవి కోరటానికి ప్రయత్నిస్తున్నారు. ఇది కాదు నిజమైన ప్రార్థన. ఇది కాదు నిజమైన భక్తి. మీదగ్గర విలువైనది ఒకటున్నది. ఆవిలువైన హృదయాన్ని భగవంతునికి అర్పించాలి. దీనినే మీరా చెప్పింది.

ఏ హృదయంబు నాసగితివో ఆశ నాకు
మరల దానిని యర్పింతు మహితమూర్తి
పరగ వేరేమి దెత్తు నీ పాదార్చనకును

ఇంక నేను తెచ్చేది ఏమీలేదు. నీవిచ్చినదే నీకు అర్పిస్తున్నాను. ఇది కూడను నాది కాదు. ఇదే నిజమైన పరిపూర్ణమైన భక్తి. ఇచ్చినదెవరు? నీవే. నీది నీకే అర్పితము చేస్తున్నాను. కాని యింతటి వివేకము అందరికీ కలగటంలేదు. గంగలో నిల్చుకుంటారు, గోదావరిలో నిల్చుకుంటారు కృష్ణలో నిల్చుకుంటారు కేశవాయనమః, నారాయణాయనమః, మాధవాయనమః గంగనీరు గంగకే అర్పితము చేస్తున్నారు. కానీ ఏదో వీరి తాతసొత్తు తెచ్చి అర్పితము చేస్తున్నట్లుగా భావిస్తున్నారు. నేను చేస్తున్నాను అన్న భావమే పెద్ద చెడ్డ భావము. నీవు చేసేది యేమీలేదు. నీవు కేవలము నిర్మల చిత్తుడవై వుంటే చేయవలసినదంతా తానే చేస్తాడు. పసిబిడ్డను తల్లి తొట్టెలో పండబెడుతుంది. కానీ అన్ని తల్లిపై ఆధారపడిన యీ బిడ్డకు తల్లియే క్షణక్షణమునకు ఆ అవసరాన్ని బట్టి తానే ఆ బిడ్డ సేవ చేస్తూ వుంటుంది. అనగా శరణాగతియైన సాధకునకు సర్వము కూడను భగవంతుడే చూచుకుంటాడు. అయితే అందరికీ యిట్టి పవిత్రమైన ఉన్నతస్థాయి లభించటములేదు. ఇది చేతకాదని కూడను మనము నిరుత్సాహము నిస్పృహకు గురికాకూడదు. మన ప్రయత్నము మనము చేయాలి. మనప్రయత్నమును పురస్కరించుకొనియే భగవంతుని అనుగ్రహము కూడను చేరుతుంటాది. కనుకనే మనము చేయవలసినవి సక్రమమైన మార్గములో, సరైన చిత్తముతో ఆచరించటానికి ప్రయత్నించాలి. శాస్త్రములు, వేదములు, ఇతిహాసములు, ఉపనిషత్తులు యివన్నియు మానవుని గమ్యము చేర్పటానికి వివిధమైన సోపానములే. సర్వవేదముల సారము, సర్వఉపనిషత్తుల సారము, సర్వవేదాంతముల యొక్క గమ్యము దైవము ఒక్కడే. మార్గములు వేరు వేరు. మార్గములు వేరని పురస్కరించుకొని భగవంతుడు వేరని భావించుకొనటము వెఱ్ఱితనము. కనుక మనము యీ గమ్యాన్ని మాత్రమే లక్ష్యమునందుంచుకొని ధన్యులు గావటానికి తగిన కృషిని మనము చెయ్యాలి. మనము ఎన్నోరకములైన పుష్పములతో పూజ చేస్తున్నాము. కొంతమంది గులాబి పుష్పముతో తెచ్చి పూజ చేయాలనుకుంటున్నారు. మరికొంత

మంది తామర పుష్పములే అర్పించాలని ఆశిస్తుంటారు.

శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే
జీవ జంతులు వేరు జీవుండు ఒక్కడే
జాతి నీతులు వేరు జన్మమొక్కటే
దర్శనంబులు వేరు దైవమొక్కడే
పూల జాతులు వేరు పూజ ఒక్కటే.

కనుకనే అనేకత్వములో వున్న యేకత్వాన్ని మనము దర్శింపు జేసేదే ఆత్మజ్ఞానము. దీనిని పురస్కరించుకొనియే 'ఈశావాస్య మిదమ్ సర్వమ్' 'ఈశ్వర సర్వ భూతానామ్' 'ఏకోవసి సర్వ భూతాంతరాత్మ' అందరియందు వుండిన దైవము ఒక్కడే అని గుర్తించుకున్నప్పుడు యిందులో వుండిన ఏకత్వాన్ని యేవిధముగా ఆచరణలో పెట్టుటం లేదు కేవలము ఏకత్వాన్ని మనము బోధిస్తున్నాము. ఉచ్ఛరిస్తున్నాము. కాని భిన్నత్వాన్ని అనుభవిస్తున్నాము.

కొంత మంది దైవానికి ద్రోహము చేయుటానికి ప్రయత్నము చేస్తూవుంటారు. కాని యిదివారు దైవానికి ద్రోహము చేస్తున్నామని అనుకుంటున్నారు చాలా పొరపాటు. దైవానికి ఎవరు కూడను ద్రోహము చేయలేరు. తనకు తాను ద్రోహము చేసుకుంటున్నాడు. ఎట్టి కల్పిత భావములు గాని, ఎట్టి వంచితమైన భావములు గాని, ఎట్టి యుక్తులతో కూడిన భావములు గాని యిది తనను తాను వంచన చేసుకోటమే గాని దైవత్వాన్ని వంచన చేయటం యేమాత్రము కుదరదు. కనుక మంచి చేసినా చెడ్డ చేసినా తనకు తాను చేసుకోటమే. కనుక యిట్టి సత్యాన్ని గుర్తించి మానవుడు సమస్త జీవులయొక్క ఆనందమును, సమస్త జీవులయొక్క శాంతి సంతోషములను ఆశించటానికి తగిన కృషి చేయాలి.

లోకశాంతి నిమిత్తమై యజ్ఞయాగాదులు జరుగుతున్నాయి. అవి ఏమిటి? దైవమును ప్రసన్నుని గావించుకొన్నప్పుడు జగత్తంతా ప్రసన్నతగా వుంటుంది. కనుక దైవాన్ని ప్రసన్నుని గావించుకొనే మార్గమే యీ యజ్ఞయాగాది క్రతువులు. దీనియందు మరియొక అంతరార్థము కూడా వుంటున్నది. ఈ జగత్తునకు సర్వము అనుగ్రహించినవాడు భగవంతుడు. తాను అనుగ్రహించినది తనకు అర్పితము చేయుటమే సాధకుని ప్రధాన కర్తవ్యము. ఆ అర్పితము చేయుటము లోపల కేవలము తనయొక్క ఆనందము నిమిత్తము అర్పితము చేయుటమే గాని

తాను యిందులో త్యాగము చేసినట్లు కాదు. లౌకిక దృష్టిలో మాత్రము మనము యేదో భగవంతునికి అర్పితము చేసినట్లుగా భావిస్తుంటాము. అప్పుడే మనకు శాంతి సంతోషములు లభిస్తున్నాయని భావిస్తున్నాము. దీనిని పురస్కరించుకొనియే వేదమునందు నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశు. త్యాగము చేత అమృతత్వము మనకు లభిస్తున్నదని చెప్పటము లోపల అంతరార్థము ఏమిటి కనుక వ్యక్తిత్వాన్ని త్యాగము చేయాలి. సమిష్టిత్వాన్ని మనము అభివృద్ధి పరచాలి. సమాజములో మనము ప్రవేశించాలి. సమాజములో నున్న పరమేశ్వరుని మనము సేవించాలి. ఎందుకనగా సువిశాల జ్ఞాన తత్వాన్ని చూడలేని మానవుడు, జీవిత అంతరాంతరాలలో ప్రవేశించలేని మానవుడు విశ్వశాంతిని యేరీతిగా సాధించగలడు. విశ్వశాంతి, సమాజ శాంతిపై ఆధారపడి వున్నది. సమాజ శాంతి వ్యక్తిపై ఆధారపడి వున్నది. వ్యక్తి శాంతిగా వుండినప్పుడే సమాజానికి శాంతి రూపములో తీర్చిదిద్దవచ్చు. సమాజము శాంతి భద్రతలలో వుండినప్పుడే దేశమంతా శాంతి భద్రతలతో నిండివుంటుంది. కనుక వ్యక్తి సమాజము, విశ్వము యీ మూడు కూడను త్రిమూర్త్యాత్మిక స్వరూపములు. ఇవి అన్యోన్య ఆశ్రయములు. ఇవి అవినాభావ సంబంధములు. కనుక వ్యక్తి యొక్క ఆనందాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ ఆనందాన్ని మనము సమాజములో నింపాలి. సమాజముతో నిండిన ఆనందముతో లోకాన్ని అంతా కూడను మనము వ్యాపింప జేయాలి. మీ శాంతి సంతోషములంతా కూడను స్వార్థముగా నింపుకో కూడదు. కేవలము తైలముపైన వేసిన నీటి బొట్టువలె కాని, లేక నీటిపైన పెట్టిన తైలపుబొట్టు వలెకాని మన జీవితము యేకాకి జీవితముగా గడుపకూడదు. ఎవరిని ద్వేషించకూడదు ఇదే భగవద్గీత యొక్క సారాంశము. అద్వేష్టా సర్వభూతానామ్. ఎవరిని ద్వేషించినను నిన్ను నువ్వు ద్వేషించుకున్నవాడే. నాతల్లి, నాతండ్రి, నాఅక్క, నా చెల్లెలు, నా పుత్రులు నాభార్య అని యింత మాత్రమే కేవలము ఒక సంకుచితమైన ఒక కుటుంబముగా నీవు భావించరాదు. నీది విశ్వకుటుంబముగా నీవు భావించాలి. హృదయాన్ని విశాలముగా నీవు చేసుకోవాలి. అప్పుడే ఆ విశాల హృదయమునందే దైవము నివసించటానికి వీలవుతుంది. ఇలాంటి విశాల భావములు పెంచుకొనే నిమిత్తమై యజ్ఞయాగాదిక్రతువుల ద్వారా త్యాగ భావమును, వ్యక్తిత్వము త్యాగము గావించుకొనే మార్గమును బోధిస్తూ వచ్చాయి.

ఆనాటి మహర్షులు చెప్పిన మాటలే మంత్రములుగా మారిపోయినాయి. మంత్రములు వేరు మాటలు వేరు కాదు. పవిత్రమైన హృదయమునుండి

ఆవిర్భవించిన ప్రతి శబ్దము కూడను మంత్రస్వరూపకముగా రూపొందింది. తామ పెట్టిన ప్రతి పాదము కూడను ఒక పుణ్యక్షేత్రముగా రూపొందింది. చూచిన చూపులన్నీ కూడను పవిత్రమైన సౌందర్య చూపులుగా మారి పోయాయి. సర్వత్ర వారు శివం మంగళకరముగా చూస్తూ వచ్చారు. సర్వమును సుందరముగా భావిస్తూ వచ్చారు. సర్వము కూడను నిత్యముగా భావిస్తూ చూచారు. కనుకనే సత్యం శివం సుందరం అనే స్వరూపమును పొందినారు. మన యొక్క జీవితము యీ సత్యం శివం సుందరం. ఆత్మ సత్యం, హృదయం శివం, మన భావము సుందరం. కనుక సత్యం శివం సుందరం అంతా మన హృదయమునందే వుంటున్నాది. దీనినే యంత్రం, మంత్రం, తంత్రం అన్నారు. మన దేహమే ఒక యంత్రము. మన శ్వాసయే ఒక మంత్రము. మన హృదయమే తంత్రము. ఈ శ్వాసాన్ని ఏ విధముగా చేస్తున్నామో యోచించుకోవచ్చు. సో..హం యిది మంత్రము కదా. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడను మంత్ర రూపము చెందింది. ఏదో ఒక గురువులు దగ్గరకు వెళ్ళి వారిని ప్రార్థించి, వారిని ఆశ్రయించి యేదో ఒక మంత్రాన్ని మనము తీసుకున్నట్టుగా భావిస్తున్నాము. కాదు కాదు. నిత్యజీవితము లోపల మన దేహము నుండియే అంతర్వాణి క్షణ క్షణమునకు సోహం సోహం నేనే దైవము నేనే దైవము అని ఒక్క దినమునకు 21,600 పర్యాయములు బోధిస్తుంటే దీనిని నీవు లక్ష్యము చేసుకోటంలేదు. ఏదో గురువు దగ్గరకు పోయి చేతిలో కాసులు, చెవిలో మంత్రము చెప్పేస్తే అది పెద్దగ భావించి దానిని ఆశ్రయిస్తూ వస్తున్నావు. ఇది చాలా పొరపాటు. ఈ యిమిటేషన్లు మనకు వుండ కూడదు. మన హృదయములో ఆవిర్భవించిన ఆత్మ తత్వాన్ని మనము అనుసరించాలి. మర్మమెరిగిన మరునిముషంబున మనసే వారికి గురువండి. అంతకంటె పెద్ద గురువు లేడు. కనుక సమస్త శాస్త్రములందున చక్కని ఒకచిట్కాగా చెప్పిన మంత్రము లోపల దైవత్వాన్ని నీ హృదయములో ప్రతిష్ఠించుకొమని చెప్పింది. ఈ కర్మకాండయందుండిన రహస్యాన్ని తిరిగి యీ కర్మకాండ జ్ఞాన మార్గము వరకు యే విధముగా ప్రయాణమవుతుందని మనము యీ వచ్చే యేడు దినములలో మనము పూర్తి చూడగలుగుతాము. కనుక కాలము వ్యర్థము చేయక కాయము నిరుపయోగ పరచక, కర్తవ్యమును నిర్వర్తించి జన్మను సార్థకము చేసుకోండి.